సాక్షి
మహబూబాబాద్
గురువారం । 23 । నవంబర్ । 2023



చుక్కల దుప్పి స్వాధీనం

పలిమెల సెక్షన్ పరిధిలో గొర్రెలు, మేకల కాపరులకు దొరికిన చుక్కల దుప్పిని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని అడవిలో వదిలిపెట్టారు. - 10లో▸



బాలికలపై వివక్ష తగదు - 11లో▸

బాలికలపై వివక్ష తగదని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ అరుణ అన్నారు. నేరడ కేజీబీవీలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.

గరిష్టం/కనిష్టం
33.0^{0} / 20.4^{0}


వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలిగా ఉంటుంది.

నాడు ప్రత్యర్థులు.. నేడు మిత్రులు

పార్టీలు మారడంతో ఒకే గూటికి నాయకులు

- విమర్శించిన నోటితోనే ప్రశంసలు
- అభ్యర్థుల గెలుపుకోసం కలిసి పనిచేస్తున్న వైనం
- రిజర్వేషన్లతో నియోజకవర్గాల్లో మారిన పోటీ



సాక్షి, మహబూబాబాద్: రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే. ఒకప్పుడు ప్రత్యర్థులుగా పోటీలో ఉండి ఎదురుపడి విమర్శలు చేసుకున్న నాయకులు ఇప్పుడు ఒకే పార్టీలో ఉండి మిత్రులుగా మారారు. కాగా కాలం మారింది.. రిజర్వేషన్లు మారాయి.. వీటితోపాటు నాయకులు పార్టీలు కూడా మారడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఓడించండి అన్న నోటితోనే గెలిపించండి అనే నినాదాలు చేస్తున్నారు. అందరూ కలిసి అభ్యర్థుల గెలుపుకోసం పని చేస్తున్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ప్రత్యేక కథనం.

డోర్నకల్‌లో ప్రత్యర్థులందరూ ఒకే చోట

డోర్నకల్ నియోజకవర్గ రాజకీయాలు ఎవరు ఊహించని విధంగా మారాయి. ఒకప్పుడు ప్రధాన పోటీదారులుగా ఉన్న వారు ఇప్పుడు ఒకే వేదికపైకి ఎక్కి మాట్లాడే పరిస్థితి నెలకొంది. 1989 ఎన్నికల్లో డోర్నకల్ జనరల్ నియోజకవర్గం అయినప్పటికీ.. ప్రస్తుత బీఆర్‌ఎస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలోకి దిగారు. అప్పుడే కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన ప్రస్తుత మంత్రి సత్యవతి రాథోడ్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అదేవిధంగా 1994, 1999ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి రెడ్యానాయక్ పోటీలో ఉండగా ఒకసారి స్వతంత్ర అభ్యర్థిగా, మరోసారి టీడీపీ అభ్యర్థిగా ప్రస్తుత బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి పోటీలో ఉన్నారు. 2009, 2014 ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ నుంచి రెడ్యానాయక్ పోటీ చేయగా.. 2009లో టీడీపీ నుంచి, 2014 ఎన్నికలో బీఆర్‌ఎస్ నుంచి సత్యవతి రాథోడ్ పోటీ చేశారు. ఇందులో 2009లో సత్యవతి గెలుపొందగా.. 2014 ఎన్నికల్లో రెడ్యానాయక్ గెలిచారు. అయితే ప్రస్తుతం రెడ్యానాయక్, సత్యవతిరాథోడ్, నూకల నరేష్‌రెడ్డి ముగ్గురు బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నారు. నాడు ప్రత్యర్థిగా ఉన్న రెడ్యానాయక్‌ను ఓడించాలని చెప్పిన వీరే ఇప్పుడు ఆయనను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేస్తున్నారు.

మహబూబాబాద్ నియోజకవర్గంలో..

మహబూబాబాద్ నియోజకవర్గంలో నాటి ప్రత్యర్థులు బానోత్ శంకర్‌నాయక్, మాలోత్ కవిత ఇప్పుడు బీఆర్‌ఎస్‌లో ఉన్నారు. నాడు ఓడించాలని ఒకరిపై ఒకరి విమర్శలు చేసుకున్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాలోత్ కవిత పోటీచేశారు. అప్పుడే రాజకీయాల్లోకి వచ్చిన శంకర్ నాయక్ ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీ చేశారు. అలాగే 2014లో కవిత కాంగ్రెస్ పార్టీ నుంచిపోటీచేయగా.. శంకర్‌నాయక్ మాత్రం బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒకరికి వ్యతిరేకంగా ఒకరు ప్రసంగాలు చేశారు. ఒకరికొకరు విమర్శలు కూడా చేసుకున్నారు. ఈ క్రమంలో కవిత బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. గత పార్లమెంట్ ఎన్నికలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీచేసిన కవితకు మద్దతుగా శంకర్‌నాయక్ ప్రచారం చేశారు. ఇప్పుడు శంకర్‌నాయక్‌కు మద్దతుగా కవిత ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్న ఆమె పార్టీ విజయే లక్ష్యం అంటూ.. శంకర్ నాయక్ కోసం ప్రచారం చేయడం గమనార్హం.

జంగ్ తెలంగాణ

కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించాలి

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం


ఓటరు చైతన్య సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

తొర్రూరు రూరల్: కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపి ంచాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులో రామ ఉపేందర్ గార్డెన్‌లో తె లంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య సదస్సు నిర్వహించారు. ము ఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఓట్లు చీలిపోకుండా ఉండేందుకే తాము పోటీలో నిలవలేదని, ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నామన్నారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి అన్నివర్గాల ప్రజలు మార్పు తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనుమాండ్ల ఝూన్సీరెడ్డి మాట్లాడుతూ.. పాలకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. వందలాది మంది విద్యార్థులు, యువకుల పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ఒకే కుటుంబం చేతిలో పెట్టామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యమకారులు, నిరుద్యోగుల ఆశయాలు నెరవేస్తామన్నారు. తన కోడలు యశస్విని రెడ్డిని ఎమ్మెల్యేగా బరిలో నిలిపానని, భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ కరుణాకర్ దేశాయి, న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి, ఆయా సంఘాల ప్రతినిధులు నిరూప్, సోగరాం బేగం, గోపినాథ్, యాదగిరి, కొండారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సయ్యద్‌రఫీ, సతీష్‌గౌడ్, ఆడెల్లి సన్నీ, బీకే రెడ్డి, వెంకటరమణ, శ్రీనివాస్, రవిచంద్ర పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి


మాట్లాడుతున్న మాజీ జేడీ లక్ష్మీనారాయణ

గంగారం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని, ఆదిశగా కృషి చేయాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కోమట్లగూడెం గ్రామంలో కోదండరామాలయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జేడీ ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తలదించి పుస్తకాన్ని చదివితే జీవితాంతం నిన్ను తలెత్తుకుని బతికేలా చేస్తుందని అన్నారు. అంబేడ్కర్, భగత్‌సింగ్ లాంటి మహనీయులను తయారు చేసింది గ్రంథాలయాలేనని చెప్పారు. తలదించి సెల్ ఫోన్ చూస్తే జీవితాంతం తలదించుకునే బతకాల్సి వస్తుందన్నారు. గ్రామానికి గ్రంథాలయం కావాలని అడిగిన కోదండ రామాలయ కమిటీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ కన్వీనర్ పింగిలి కవితారెడ్డి, కోదండ రామాలయ కమిటీ చైర్మన్ సైప సురేష్, ప్రతినిధులు ప్రతాపని శ్రీకాంత్, మాలె రాజేష్, సైప రాంచందర్, రోటరీ క్లబ్ ప్రతినిధులు ఇరుకు దేవేందర్‌రావు, రంజిత్, వెంకట్రామనర్సయ్య, ఎంపీపీ సువర్ణపాక సరోజన, జెడ్పీటీసీ ఈసం రమ, సర్పంచ్ సుగుణలక్ష్మయ్య, వివిధ ప్రజాసంఘాలు, యువజన సంఘాల నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు చోట్ల ఓట్ల లెక్కింపు!

ఉమ్మడి జిల్లాలో కేంద్రాలు ఖరారు

- ఏనుమాములలో 5 అసెంబ్లీ స్థానాలవి లెక్కింపు
- ములుగు, భూపాలపల్లి, మానుకోట, జనగామ ఎక్కడివక్కడే
- డిసెంబర్ 3న కౌంటింగ్‌కు కసరత్తు

హన్మకొండ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో శాసనసభ ఎన్నికలను పటిష్టంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ప్రచార గడువు దగ్గర పడుతుండడంతో ఒక వైపు పోలింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం అంతే వేగంగా కౌంటింగ్ కోసం కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మొత్తం 12అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 30 పోలింగ్ జరగనుంది. వీటి ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న జరగనుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలో మొత్తం ఐదు లెక్కింపు కేంద్రాలను గుర్తించారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటికే ఏర్పాట్లు మొదలు పెట్టారు. గతంలో వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులోనే లెక్కింపు చేసిన అధికారులు ప్రసుత్తం జిల్లాల వారీగా విభజించారు. ఏనుమాముల మార్కెట్‌లో వరంగల్ పశ్చిమ, తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల (ఐదు) నియోజక వర్గాల ఓట్లు లెక్కించనున్నారు. అదేవిధంగా జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజక వర్గాల ఓట్లు జనగామ జిల్లా పెంబర్తి లోని విద్యా భారతి ఇంజనీరింగ్ కాలేజీలో చేపట్టనున్నారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల ఓట్లు మహబూబాబాద్ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో, భూపాలపల్లివి అక్కడి సీసీఈఆర్ క్లబ్‌లో, ములుగు ఓట్లు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల మీటింగ్ హాల్లో లెక్కించాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా కేంద్రాలను గుర్తిస్తూ జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఆయా జిల్లాల జిల్లాల ఎన్నికల అధికారులు, ఆర్‌ఓలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు మొదలు..

ఐదు నియోజక వర్గాలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహించే హాల్స్‌లో 24గంటల పాటు కరెంట్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యవసరాల కోసం జనరేటర్లు అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూంలకు తరలించిన ఈవీఎంల వద్ద సాయుధ బలగాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా సీసీ కేమెరాలు తాగునీరు, లైటింగ్ బారికేడ్లు, టాయిలెట్స్ వంటి సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన బోర్డులు, రిజిస్టర్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకోసం అవసరమయ్యే బాక్స్‌లు వంటివాటిని అధికారులు సిద్ధం చేశారు. కౌంటింగ్ టేబుల్స్, జాలీలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. వీటి పనులు మొదలు పెట్టారు. ఇప్పటికే హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యలు.. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల ఏజెంట్లతో కలిసి ఏనుమాముల గోదాంలో లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలు సందర్శించి పరిశీలించారు. ఈవీఎంల భద్రత, కౌంటింగ్ ఏర్పాట్ల గురించి వారికి వివరించారు. అదేవిధంగా త్వరలో కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోటీ చేస్తున్న అభ్యర్థులు	కౌంటింగ్ కేంద్రం
జనగామ	277	19	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
స్టేషన్ ఘన్‌పూర్	290	19	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
పాలకుర్తి	294	15	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
డోర్నకల్	256	14	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, మహబూబాబాద్
మహబూబాబాద్	283	12	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, మహబూబాబాద్
నర్సంపేట	283	16	గోడౌన్ నం 17/ఏ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
పరకాల	239	28	గోడౌన్ నం 4/సీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వరంగల్ పశ్చిమ	245	15	గోడౌన్ నం 4/డీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వరంగల్ తూర్పు	230	29	గోడౌన్ నం 17/బీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వర్ధన్నపేట	278	14	గోడౌన్ నం 17/సీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
భూపాలపల్లి	317	23	సీఈఆర్ క్లబ్, అంబేడ్కర్ స్టేడియం, భూపాలపల్లి
ములుగు	303	11	జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మీటింగ్ హాల్

ఓటింగ్‌లో తాత్సారం

పూర్తిస్థాయిలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగంలో జాప్యం

- శిక్షణలోనే ఓటు వేయించడంలో అధికారుల విఫలం
- రెండు నియోజకవర్గాల్లో 5,000మందికి పైగా అధికారులు, సిబ్బంది
- హోం ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

మహబూబాబాద్: జిల్లాలో ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. తుది ఓటరు జాబితా సిద్ధం చేసి, ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తూ ఎన్నికల అధికారులు, సిబ్బందిని సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను కల్పించారు. కాగా వారు శిక్షణరోజే ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆదేశాలు ఉన్నా తాత్సారం జరుగుతోంది. రెండో విడత శిక్షణలోనూ పూర్తిస్థాయిలో ఓటు హక్కు వినియోగం జరగలేదు. కాగా అధికారుల మధ్య సమన్వయం లోపంతోనే జాప్యం జరుగుతుందని ప్రచారం.

4,72,606 మంది ఓటర్లు..

జిల్లాలో పూర్తిస్థాయిలో ఉన్న డోర్నకల్, మానుకోట నియోజకవర్గాల్లో 4,72,606 మంది ఓటర్లకు 539 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా 929మంది పీఓలు, 929మంది ఏపీఓలు, 1855మంది ఓపీఓలు, అదనంగా 20శాతం సిబ్బందితో పాటు పోలీస్, ఇతరులు కలిసి 5000పైచిలుకు సిబ్బంది ఎన్నికల విధులు నిర్వర్తిస్తారు. కాగా ఎన్నికల సిబ్బందికి ఈ నెల 21, 22 తేదీల్లో రెండో విడత శిక్షణ ఇచ్చారు. కాగా ఈ శిక్షణలోనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే అవకాశం కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా పూర్తిస్థాయిలో సక్సెస్ కాలేదు. దీంతో ఓటు హక్కు వినియోగించుకోనివారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

సమన్వయ లోపం..

పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగంలో అధికారుల సమన్వయంలోపం స్పష్టంగా కనిపిస్తోంది. నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ బ్యాక్స్‌లు, ఇతర సామగ్రి పంపిణీలో ఆలస్యం వల్లే ఓటు హక్కు వినియోగంలో జాప్యం జరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. రెండు నియోజకవర్గాల్లో శిక్షణ వద్దే బ్యాలెట్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తే అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఓటు హక్కును వినియోగించుకునేవారు. కాగా సమన్వయలోపంతో చాలామంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. ఈ నెల 29న ఓటు వేసే అవకాశం ఉన్నా.. ఆరోజంతా ఎన్నికల సామగ్రి సర్దుకోవడంతోనే సరిపోతుందని అధికారులు వాపోతున్నారు.



హోం ఓటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు..

ఈనెల 23, 24వ తేదీల్లో హోం ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దివ్యాంగులు, 80ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు ఎన్నికల సంఘం ఇంటి వద్దే ఓటింగ్‌కు అవకాశం కల్పించింది. కాగా 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు హోం ఓటింగ్‌కు అర్హులు. కాగా జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 997మంది ఇంటి వద్ద ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈమేరకు పీఓ, అసిస్టెంట్, పోలీస్, వీడియోగ్రాఫర్, వాహనం ఏర్పాటు చేశారు.

అందరికీ అవకాశం కల్పిస్తాం

ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పిస్తాం. వేరే నియోజకవర్గాల నుంచి రావాల్సిన బాక్స్‌ల విషయంలో కొంత ఆలస్యమైంది. కొంత మందికి అవకాశం కల్పించాం. మిగిలిన అందరికీ సమయం పెంచి అవకాశం కల్పిస్తాం. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.


– రమాదేవి, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల నోడల్ అధికారి

దూరవిద్య ఎంబీఏ ఫస్ట్ సెమ్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి దూరవిద్య ఎంబీఏ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఎక్స్ విద్యార్థులకు డిసెంబర్ 6 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. డిసెంబర్ 6, 12, 16, 21, 28, జనవరి 3, జనవరి 8న పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

పోలింగ్ శిక్షణను బాధ్యతగా తీసుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక


మరిపెడలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మరిపెడ/మహబూబాబాద్ అర్బన్: పోలింగ్ శిక్షణను బాధ్యతగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. మరిపెడలోని మోడల్ స్కూల్, మానుకోటలోని డిగ్రీ కళాశాలలో రెండోరోజు కొనసాగిన పోలింగ్ అధికారుల శిక్షణ తరగతులను కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల పోలింగ్ విధానంపై పీఓలు, ఏపీఓల బాధ్యతలను వివరించారు. అవగాహన ప్రధానమని, ఆందోళన చెందవద్దన్నారు. పోలింగ్ విధులు చేపట్టే అధికారులందరికీ పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తామన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే పీఓలు, సిబ్బంది కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేశామని చెప్పారు. పోలింగ్ సామగ్రి తీసుకునేటప్పుడు చెక్‌లిస్ట్‌లో సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులు తొందరపడొద్దని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామన్నారు. డోర్నకల్, మహబూబాబాద్ రిటర్నింగ్ అధికారులు నరసింహారావు, అలివేలు, సహాయ రిటర్నింగ్ అధికారులు నాగభవాని, సైదులు, నరేష్, భగవాన్‌రెడ్డి, శిక్షణ తరగతుల నోడల్ అధికారి రామారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పింగిళి కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్)లో 2023–2024 విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీ గేట్ ద్వారా అర్హత సాధించిన విద్యార్థులకు ఇప్పటికే ప్రవేశాలు జరగా యని పేర్కొన్నారు. వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్లలో ఈనెల 24న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను సీపీ గేట్ కన్వీనర్ అనుమతితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీ గేట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. అర్హత సాధించని వారు డిగ్రీ సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు కలిగి ఉండి అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, హిస్టరీ, ఎంకామ్, ఎమ్మెస్సీ బాట నీ, జువాలజీ, మైక్రోబయాలజీలో అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 24న నేరుగా కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు హాజరై అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

- వీసీలో డీజీపీ అంజనీకుమార్


వీసీలో పాల్గొన్న ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అధికారులు

మహబూబాబాద్ రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం నుంచి ఆయన బుధవారం జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వద్ద పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం లాంగ్ పెండింగ్ కేసులు, సైబర్ నేరాలు, ఇతర అంశాల గురించి చర్చించారు. ఈ సమీక్షలో జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ బాలాజీవరప్రసాద్, ఎలక్షన్ సెల్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అర్హత ఉన్న వైద్యులే చికిత్స చేయాలి

- జిల్లా వైద్యాధికారి అంబరీష



తొర్రూరు: ప్రైవేట్ ఆస్పత్రుల్లో అర్హత ఉన్న వైద్యులే చికిత్స చేయాలని జిల్లా వైద్యాధికారి అంబరీష అన్నారు. డివిజన్ కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, ఆప్టికల్, స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లను బుధవారం డీఎంహెచ్‌ఓ, ఇతర వైద్యాధికారులు తనిఖీ చేశారు. నిర్వాహకుల అర్హత ధ్రువ పత్రాలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు లేని, గడువు ముగిసిన వాటికి నోటీసులు జారీ చేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. అర్హతలు లేని వారు వైద్యం చేస్తేత కఠిన చర్యలు తప్పవన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందించే చికిత్సలు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్స్ కేంద్రాల్లో ధరల పట్టికలు ఏర్పాటు చేయాలన్నారు. తనిఖీల్లో ఎన్‌హెచ్‌ఎం డీపీఓ రుక్ముద్దీన్, పీసీపీఎన్‌డీటీ నోడల్ పర్సన్ కృష్ణార్జున్, సీహెచ్‌ఓ రుద్రపతి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ పటిష్టంగా నిర్వహించాలి



మహబూబాబాద్: హోం ఓటింగ్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఢిల్లీ నుంచి నితీష్‌వ్యాస్, రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌తో కలిసి జిల్లా కలెక్టర్లతో పోలింగ్ నిర్వహణ, ఇతర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ర్యాండమైజేషన్ పక్కాగా నిర్వహించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. హోం ఓటింగ్ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటున్నామన్నారు. జిల్లాలోని మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాల్లో 87శాతం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశామన్నారు. పోలింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి విధులు నిర్వర్తిస్తున్న అధికారుల నుంచి పోస్టల్ బ్యాలెట్‌లను స్వీకరిస్తున్నామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ డేవిడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం



కేసముద్రం: జిల్లాలోని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ధాన్యంతో పోటెత్తింది. ఇటీవల వరికోతల సీజన్ ప్రారంభం కాగా బుధవారం చుట్టుపక్కల గ్రామాల నుంచి 15వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. దీంతో షెడ్లు, ఓపెన్‌యార్డులు ధాన్యం రాశులతో నిండిపోయాయి. రెండు రోజులుగా ధాన్యం అత్యధికంగా వస్తుండగా.. కాంటాలు, తొలకాలలో ఆలస్యం కావడంతో ధాన్యంరాశులు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ఎగుమతులు జరపడానికి ఎడ్లబండ్లు, లారీలు, ట్రాక్టర్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ధాన్యం రాశుల వద్దే రైతులు పడిగాపులు కాయాల్సివస్తోంది. కాగా ధాన్యానికి(ఆర్‌ఎన్‌ఆర్ కొత్తవి) గరిష్ట ధర రూ.2,891, కనిష్ట ధర రూ.2,011 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

డిగ్రీ పరీక్ష ఫీజులు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) విద్యార్థులు అపరాధ రుసుము లేకుండా పరీక్షల ఫీజులు డిసెంబర్ 4 వరకు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 8వ తేదీ వరకు గడువు ఉందన్నారు. కాగా.. పరీక్షల ఫీజులను కళాశాలల యాజమాన్యాలు ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలన్నారు. అన్ని కళాశాలలు పరీక్ష ఫీజు నోటిఫికేషన్‌ను విధిగా కళాశాలల్లో నోటీస్ బోర్డుపై ఉంచాలని ఆదేశించారు.

పరాయిపాలనకు స్వస్తి పలకాలి


దేవరుప్పుల: ప్రచారంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

- ప్రకృతి వనరులను కూల్చి.. పేదల పొట్టగొడుతున్నారు
- కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి అభ్యర్థి యశస్వినిరెడ్డి

దేవరుప్పుల : కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రం మాదిరిగా చైతన్యవంతులైన నియోజకవర్గంలో పరాయిల పాలనకు పాలకుర్తి ప్రజలు స్వస్తి పలకాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి ముస్పహాడ్, గొల్లపల్లి, కామారెడ్డిగూడెం, సీతారాంపురం, కడవెండి, చిప్పరాళ్లబండతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరు, మలివిడత ఉద్యమాల్లో అమరులైన దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ, కాసోజు శ్రీకాంతాచారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ తెచ్చుకున్నది మన వనరులు, ఉద్యోగాలు సాధించుకోవడానికి.. అయితే ఆచరణలో అలా జరగడం లేదు.. ప్రకృతి వనరులను కూల్చి ఉపాధి కల్పన పేరిట బడా కంపెనీల కోసం భూసేకరణ చేసి పేదల పొట్టగొట్టేందుకు పాలకులు యత్నిస్తున్నారని ఆరోపించారు. ముస్పహాడ్ రైతుల పక్షాన కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. తనను ఆదరించి గెలిపిస్తే.. కామారెడ్డిగూడెంలో కాంగ్రెస్ హయాంలో శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన బడి, రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల మాదిరిగా మిగిలిన పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి నియోజకవర్గాన్ని 'హస్తగతం' చేసుకోవడానికి కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు ఎన్.ప్రవీణ్‌రావు, సీపీఐ జిల్లా నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, జీడీ ఎల్లయ్య, పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, సురేష్‌బాబు, ఓడపల్లి రవీందర్, పారుపెల్లి శ్రీనివాస్, రెడ్డిరాజుల రమేష్, సోమనర్సోజీ, మహేందర్‌జీ, గ్రామ బాధ్యులు యాకన్న, వెంకన్న, రతన్‌జీ, రాంబాబు, యాకు పాల్గొన్నారు.


తొర్రూరు: ఝాన్సీరెడ్డిని కలిసిన గౌడ ప్రతినిధులు


కొడకండ్ల: కాంగ్రెస్‌లో చేరిన వారితో ఝాన్సీరెడ్డి

విద్యావంతుల సంపూర్ణ మద్దతు హర్షణీయం

ప్రభుత్వ మార్పు కోరే దిశలో కాంగ్రెస్ పార్టీకి విద్యావంతుల సంపూర్ణ మద్దతు హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, పులిగిల్ల వెంకన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక న్యాయవేదిక, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు తోటకూరి పాండుకృష్ణ కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన పులిగిల్ల ఎల్లయ్య, జక్కుల సోమయ్య, రాసాల ఐలయ్య, ఆదర్శ రైతు రాసాల మల్లయ్య, తోటకూరి రవీందర్, వేల్పుల ఎల్లయ్య ఉన్నారు.

ఉన్నత విద్యావంతులను ఉపాధి కూలీలుగా మార్చారు: లక్ష్మీనారాయణనాయక్

ఉన్నత విద్యావంతులను సైతం ఉపాధి కూలీలుగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ విమర్శించారు. బుధవారం మండలంలోని ధరావత్‌తండా, ధర్మగడ్డలో నియోజకవర్గ పరిశీలకులు రాజేష్ రాథోడ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తండాబాట ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పోల్చుకుంటే గిరిజనుల్లో అక్షరాస్యత పెరిగి చైతన్యవంతులయ్యారన్నారు. కార్యక్రమంలో యాదా నాయక్, ధరావత్ రవీందర్ నాయక్, నల్ల యాదగిరి, దేవ, బీకోజీ, కిషన్, కీమా, శ్రీను పాల్గొన్నారు.

ఎర్రబెల్లికి పరాభవం తప్పదు: ఝాన్సీరెడ్డి

కొడకండ్ల : మాటల మాంత్రికుడు దయాకర్‌రావుకు ఈ ఎన్నికల్లో ప్రజల చేతిలో పరాభవం తప్పదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. బుధవారం నర్సింగాపురం మాజీ సర్పంచ్ పనస రాందాస్ గౌడ్, వార్డు సభ్యుడు ముత్యం వెంకన్న, గుర్రం లింగయ్య, సోమయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలకు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో దయాకర్‌రావును ఓడించి పర్వతగిరికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, రమేష్, రంగయ్య, యాకన్న, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్పు కోరుతున్న పాలకుర్తి ప్రజలు

పాలకుర్తిటౌన్ : పాలకుర్తి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని ముత్తారం, మల్లంపల్లి, పాలకుర్తితో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం అధిక సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ముత్తారం, పాలకుర్తి మాజీ సర్పంచ్‌లు భూమ రంగయ్య, అంగడి అంజమ్మ, మల్లంపల్లి ఉప సర్పంచ్ తంగళపల్లి యాకయ్యతో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా ఝాన్సీరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకుర్తిలో కాంగ్రెస్ యశస్వినిరెడ్డికి ఆదరణ పెరిగిందని, ఊహించని రీతిలో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు చిలువేరు కృష్ణమూర్తి, బైరు భార్గవ్, అంజిరావు పాల్గొన్నారు.

యశస్వినిరెడ్డికి గౌడ కులస్తుల మద్దతు

తొర్రూరు : పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డికి స్థానిక గౌడ సామాజికవర్గ ప్రతినిధులు మద్దతు తెలిపారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో గౌడ ప్రతినిధులు జలగం రామ్మూర్తిగౌడ్, రమేష్‌గౌడ్, బొమ్మగాని నర్సయ్య, యాకయ్య, చీకటి శంకరయ్య, బండి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



చుక్కల దుప్పి స్వాధీనం


దుప్పిని స్వాధీనం చేసుకుంటున్న అటవీ అధికారులు

పలిమెల: పలిమెల సెక్షన్ పరిధిలో గొర్రెలు, మేకల కాపరులకు దొరికిన చుక్కల దుప్పిని బుధవారం అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని అడవిలో వదిలిపెట్టారు. సెక్షన్ ఆఫీసర్ జలీమ్ షా కథనం ప్రకారం మూడు రోజుల క్రితం మహా రాష్ట్రకు చెందిన గొర్రెల కాపరులు అడవిలో జీవాలను మేతకు తీసుకెళ్లిన సందర్భంలో తల్లి నుంచి వేరుగా ఉన్న దుప్పి.. గొర్రెల మందలో కలిసింది. దుప్పికి ఎలాంటి హాని చేయకుండా కాపరులు తమ వద్దే ఉంచుకున్నారు. బుధవారం గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా సెక్షన్ ఆఫీసర్ జలీమ్ షా తన బృందంతో కలిసి గొర్రెల కాపరుల వద్ద నుంచి దుప్పిని స్వాధీనం చేసుకుని అడవిలో వదిలేశారు. బీట్ ఆఫీసర్లు శ్రీనివాస్, రమేష్, విఠల్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

- కాపాడిన కానిస్టేబుల్
- హసన్‌పర్తి చెరువు వద్ద ఘటన

హసన్‌పర్తి: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహితను కానిస్టేబుల్ రక్షించాడు. ఈ ఘటన బుధవారం హసన్‌పర్తి పెద్ద చెరువు వద్ద చోటు చేసుకుంది. నగరంలోని నయీంనగర్ ప్రాంతానికి చెందిన ఓ వివాహిత ఆర్థిక కారణాలతో భర్తతో గొడవపడి హసన్‌పర్తి పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. అయితే స్థానిక సీఐ గోపికి ఆ వివాహిత అనుమానాస్పదంగా సంచరిస్తుందనే సమాచారం అందింది. దీంతో సీఐ ఆదేశాల మేరకు కోర్టు కానిస్టేబుల్ రత్నాకర్ అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వివాహిత చెరువులో దూకడానికి సిద్ధంకాగా కానిస్టేబుల్ రక్షించారు. వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించారు. అనంతరం వివాహితకు కౌన్సెలింగ్ నిర్వహించి భర్తకు అప్పగించారు. వివాహితను రక్షించిన కానిస్టేబుల్ రత్నాకర్, తక్షణమే స్పందించిన సీఐ గోపిని సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.

చదువు ఇష్టం లేక.. విద్యార్థిని ఆత్మహత్య

మల్హర్: చదువు ఇష్టం లేక ఓ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం మల్హర్ మండలం కొండంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన దివ్య(14) మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. కొంత కాలంగా చదువుకోవడం ఇష్టం లేక మనోవేదనకు గురయ్యేది. ఈ క్రమంలో చదువుపై ఇష్టం లేకపోవడం.. జీవితంపై అవగాహన లేమి కారణంగా దివ్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అత్తా, కోడళ్ల మాటలు నమ్మొద్దు..


పెద్దవంగర: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు


కొడకండ్ల ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న దయాకర్‌రావు

- కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మోసపోతారు
- బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర: అబద్ధాలు ప్రచారం చేసే అత్తా, కోడళ్లను నమ్మొద్దు.. వారు చెప్పే మాటలు విని కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోతరని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధి చిన్నవంగర, చిట్యాల, బొమ్మకల్లుతోపాటు మండల కేంద్రంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మహిళలు మంత్రికి నుదుట తిలకం దిద్ది బతుకమ్మలు, కోలాటాలు, డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. రేలారే రేలా ఫేం గంగా, జానపద గాయని కనకవ్వ, జబర్దస్త్ ఫేం రాజమౌళి ఆటపాటలతో ప్రజలను ఆకర్షించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. మీతో నిత్యం ఉంటూ మీ కష్టాల్లో పాలుపంచుకున్న తనను నమ్ముతారా.. ఇప్పుడు వచ్చి ఒక్క చాన్స్ ఇవ్వండని ప్రజల కాళ్లా, వేళ్లా పడుతున్న అత్తా, కోడళ్ల(ఝాన్సిరెడ్డి, యశస్వినిరెడ్డి)ను నమ్ముతారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నాడు కాంగ్రెస్‌కు పది అవకాశాలు ఇస్తే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఆ పార్టీకి ఓటేస్తే కరెంటు కోసం గోసపడిన రోజులు మళ్లీ వస్తాయని, ప్రజలు ఒక్కసారి పరిశీలన చేసుకోవాలని చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాను.. కరోనా కష్టా కాలంలో ఆనందయ్య మందును పార్టీలతో సంబంధం లేకుండా నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి కాపాడుకున్నానని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ సుధాకర్‌రావు, ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, నాయకులు రామచంద్రయ్య శర్మ, కేతిరెడ్డి దీపిక సోమనర్సింహారెడ్డి, జలగం శేఖర్, సర్పంచ్‌లు, రావుల శ్రీనివాస్ రెడ్డి, జలగం లక్ష్మీ, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను వదులుకోవద్దు : మంత్రి సత్యవతి


తొర్రూరు : గిరిజన ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

తొర్రూరు రూరల్: యాభై ఏళ్లుగా గ్రామాలతో సంబంధం లేకుండా వివక్షకు గురైన తండాలను గుర్తించి గ్రామ పంచాయతీలుగా చేసిన సీఎం కేసీఆర్‌ను వదులుకోవద్దని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. వెలికట్ట గ్రామ శివారులో నిర్వహించిన గిరిజన ఆత్మీయ ఆశీర్వాద సభలో ఆమె మాట్లాడారు. 'మన రాజ్యంలో మన పాలన'కు నాందీ పలికి గిరిజనుల ఆత్మ గౌరవాన్ని పెంచిన ప్రభుత్వం.. సేవాలాల్, తీజ్ పండుగలను అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్న సీఎం కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో 60వేల భారీ మెజార్టీతో గెలుస్తానని, గతంలో మీ దీవెనలతో గెలిచి, కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రిగా తండాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేశానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగాలంటే మరోసారి ఆదరించాలని కోరారు. అనంతరం ర్యాలీలో గిరిజనులతో నృత్యాలు చేస్తూ ఎర్రబెల్లి సందడి చేశారు..

రెడ్డి సోదరులకు అండగా ఉంటా..

తొర్రూరు రూరల్: నియోజకవర్గంలోని రెడ్డి సోదరుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. నాంచారీమడూరు శివారు రెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రెడ్డి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కువ మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తారని, అందులో రెడ్డి కులానికి చెందిన వారే ఎక్కువగా ఉంటారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు అవసరమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటి కొనసాగింపునకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటవరప్రసాద్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, చిత్తరంజన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలోచించి వేటు వేయాలి..


పాలకుర్తి : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎర్రబెల్లి ఉషాదేవి

కొడకండ్ల: మూడు గంటల కరెంట్ కావాలో.. సీఎం కేసీఆర్ సారథ్యంలో నిరంతర కరెంట్ కావాలో ఆలోచించి ఓటు వేయాలని పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని లక్ష్మక్కపల్లి, రామన్నగూడెం, కొడకండ్ల గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దయాకర్‌రావు గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

పాలకుర్తి: రాష్ట్రంలో ప్రజలకు సేవలు అందించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపే అంతిమ లక్ష్యంగా కృషి చేయాలని ఆయన సతీమణి, ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదేవి అన్నారు. బుధవారం పాలకుర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇదిలా ఉండగా. మండలంలోని పలు గ్రామాల్లో దివ్యాంగులు ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన దయాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దివ్యాంగుల సేవా సమితి నాయకులు పాల్గొన్నారు.

సేవలను చూసి గెలిపించాలి

రాయపర్తి: నియోజకవర్గానికి చేసిన సేవలను, అభివృద్ధిని చూసి ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించాలని బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు పిలుపునిచ్చారు. కాట్రపల్లిలో కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించిన ఆయన కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పార్టీ మండల ప్రధానకార్యదర్శి పూస మధు, సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, మండల శ్రీధర్, అన్వర్, ముద్రబోయిన శ్రీనివాస్, కత్తి సోమన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో గిరిజనుల చేరిక

దేవరుప్పుల: దేవరుప్పుల మండల పడమటితండా, లకావత్‌తండా, తూర్పుతండా(ఎం), కొడకండ్ల మండలం మైదంచెరువు, రాయపర్తి తండాలకు చెందిన గిరిజన యువత కాంగ్రెస్‌ను వీడి పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రామ్‌సింగ్, చింత సోమయ్య, ఎంపీటీసీ యాకూనాయక్‌పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం : కనకయ్య


కామేపల్లి : కళాకారులతో కలిసి డప్పు వాయిస్తున్న కోరం కనకయ్య


టేకులపల్లి : కనకయ్య సమక్షంలో పార్టీలో చేరిన సర్పంచ్ నీలమయ్య, తదితరులు

- ఇల్లెందు అభ్యర్థి కోరం కనకయ్య

కామేపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య వెల్లడించారు. కామేపల్లి మండలంలోని కామేపల్లి, రామకృష్ణాపురం, కెప్టెన్ బంజర, మద్దులపల్లి, జగన్నాథతండా, బాసిత్‌నగర్ గ్రామాల్లో టీపీసీసీ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనకయ్యమాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని తెలిపారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అడుగడుగునా ఇక్కట్లు ఎదుర్కొన్నారని చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని.. తద్వారా ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేస్తామని తెలిపారు. తెలంగాణ ఏర్పడితే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని ఆశిస్తే ప్రజలను బీఆర్ఎస్ నేతలు తప్పుడు హామీలతో మోసం చేశారని మండిపడ్డారు. అంతేకాకుండా మోసపూరిత వాగ్దానాలతో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. కాగా, కెప్టెన్‌బంజరలో నాయకులు ఆదివాసీ, గిరిజన సంప్రదాయ నృత్యాలతో కనకయ్యకు ఘన స్వాగతం పలికారు. అలాగే, మద్దులపల్లిలో ఎంపీటీసీ గుగులోత్ గబ్రూనాయక్ ఆధ్వర్యాన పలువురు బీఆర్ఎస్‌ను వీడి కనకయ్య సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్, వైఎస్సార్ టీపీ, సీపీఐ, టీడీపీ నాయకులు బానోత్ సుజాత, సారయ్య, తోటకూరి శివయ్య, మేకల మల్లిబాబుయాదవ్, ఆరెం రవి, గట్టికొప్పుల నారాయణరెడ్డి, రెడబోతు గోపీరెడ్డి, ఇమ్మడి రామనాథం, సుంకిరెడ్డి దామోదర్‌రెడ్డి, అజ్మీరా అర్జున్, ధరావత్ బాలునాయక్, శ్రీరాములు, ఏపూరి మహేందర్, రమేష్‌బాబు, అప్పన పిచ్చయ్య, లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని చింతోనిచెలక సర్పంచ్ వీసం నీలమయ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కోయగూడెంలో ఆయనకు కోరం కనకయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు పూనెం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ లేని పార్టీని నమ్మొద్దు

- మంత్రి సత్యవతి రాథోడ్
- హరిప్రియ గెలుపు కోరుతూ ప్రచారం


బయ్యారం: మాట్లాడుతున్న మంత్రి సత్యవతి, పక్కన హరిప్రియ


గార్ల: ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బయ్యారం: ఎప్పుడు ఎవరు సీఎంగా ఉంటారో తెలియని.. గ్యారంటీ లేని కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మొద్దని మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియను గెలిపించాలని కోరుతూ బుధవారం బయ్యారంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆమె మాట్లాడారు. వెనుకబడిన ఇల్లెందు అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అవసరమైన రహదారులను నిర్మించలేదన్నారు. అలాగే, నమ్మి పదవి ఇస్తే బీఆర్ఎస్‌ను మోసం చేసిన కనకయ్యకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈసారి హరిప్రియ గెలవగానే బయ్యారం పెద్ద చెరువుకు సీతారామ ప్రాజెక్టు నీటిని తీసుకొచ్చి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించే బాధ్యత తనదేనన్నారు. అంతకుముందు మండలంలోని అల్లిగూడెం, జగత్‌రావుపేట, కొత్తగూడెం, జగ్గుతండాలో హరిప్రియ ప్రచారం చేయగా, వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఎంపీపీ మౌనిక, వైస్ ఎంపీపీ గణేష్, జెడ్పీటీసీ ఉమాదేవి, సత్యనారాయణ, ఐలయ్య, శ్రీను, సోమిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు తథ్యం

కామేపల్లి/టేకులపల్లి: ఇల్లెందులో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ గెలుపు ఖాయమని కామేపల్లి జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు అన్నారు. మండలంలోని తాళ్లగూడెంలో బుధవారం ఇంటింటి ప్రచారం చేసిన వారు మాట్లాడారు. మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని, అదే కాంగ్రెస్‌కు ఓటు వేస్తే భవిష్యత్ ఆగమవుతుందని తెలిపారు. నాయకులు శెట్టి శ్రీనివాస్, పుచ్చకాయల బాబు, ముత్యం రాయకృష్ణ, పుచ్చకాయల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, టేకులపల్లి మండలం చుక్కాలబోడుకుచెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి భూక్య రమేష్‌నాయక్ బీఆర్ఎస్‌లో చేరగా బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు.

హరిప్రియను ఆశీర్వదించండి

గార్ల: ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియను గెలిపించాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శీలంశెట్టి రమేష్ కోరారు. ఈ సందర్భంగా గార్లలో ఇంటింటి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని విన్నవించారు. ఉత్తరయ్య, భాస్కర్‌రావు, శ్రీకాంత్, రమేష్, అనిల్, షఫీ, రవీందర్ పాల్గొన్నారు.